

-దుర్గారాణి.టి

"బుచ్చిబాబుగారూ ఫోన్ వచ్చిందండీ" అన్న ప్యూన్ పిలుపు నందుకుని ఫోనందు కున్నాడు బుచ్చిబాబు.

'హలో బుచ్చిబాబు స్పీకింగ్'

"హలో! నేనండీ మీ అర్ధాంగిని"

"ఆహా ! ఏమీ నాభాగ్యము? ఏనాడూ ఫోన్ చేయని నీవు ఈనాడు నాకు ఫోన్ చేయడమా! కఠోర తపస్సు చేస్తున్న విశ్వామిత్రుడి వ్రతభంగం చేయడానికి దేవలోకం నుండి మేనక వచ్చి నట్లుంది నాకు. ఏమి విశేషము?"

"ఆ! ఏంటండీ అలా నాటకాల డైలాగులు! .... ఏమండీ! ఈరోజు సాయంత్రం ఆఫీసయిపోగానే త్వరగా వచ్చేయండి"

"ఏమిటంత విశేషం"

"ఏం లేదండీ! ఊర్వశిలో మంచి ఇంగ్లీషు సినిమా ఉంది. అది ఇవాళే ఆఖరిరోజుట! ఎదు రింటి రాధ వాళ్ళు చూశారట. బాగుందట."

"అయితే ఇంకేం? అలాగే వెళదాం. సాయంత్రం అయిదవగానే వచ్చేస్తా. నేను వచ్చే టప్పటికి రడీగా ఉండు. సాయంత్రం సినిమాకి వెళ్ళి అట్నుంచి అలా 'స్వాగత్' లో భోంచేసి ఆతర్వాత..."

"ఊ! ఆతర్వాత...అబ్బాయిగారేదో మంచి కలలో ఉన్నట్టున్నారు. అది ఆఫీసు.."

"అబ్బ నీమాటలు వింటుంటే ఇప్పుడే శలవు పెట్టి ఇంటికొచ్చేసి ఊ..."

"అంత పనిమాత్రం చేయకండి!"

'సరే! అలాగే ఒక చిన్న ము...త్రూ ఫోన్

"ప్చ్....

"స్వీట్ డియర్ రోజా!"

"ఎవరా రోజా?..... రోజా ఏమాకథ?"

"ఎవరేమిటి డియర్! నామూడ్‌లో నీపేరే మరిచానా?"

"ఏమండి మతి సరిగా లేదా ఏంటి? పగటి కలల నుండి బయటికి రండి నాపేరు గిరిజ మర్చిపోయారా....?"

"గిరిజా..గిరిజ ఎవరు?"

"హలో మీరు బుచ్చిబాబుగారేనా మాట్లాడు తూంది?"

"అవునుబుచ్చిబాబునే .....బి.బుచ్చిబాబుని"

"బి. బుచ్చిబాబా? పి. బుచ్చిబాబుకాదా?"

"హల్లో మీరు మాట్లాడదలుచుకుంది పి.బుచ్చిబాబుగారితోనా? సారి ఉండండి పిలుస్తాను. మా ఆఫీసులో ఇద్దరు బుచ్చిబాబు లున్నాం సారీ!....."

★

